

తీరొక్క పూలతో పేరుస్తాం



ముస్తాబాద్: తెలంగాణ మహిళల ఆత్మగౌరవం బతుకమ్మ. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ పండగ అంటే అందరికీ ఎంతో ఇష్టం. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి.. సమాజంలో జరుగుతున్న సంఘటనలే ఆధారంగా పాటలు పాడి గౌరిదేవి, బతుకమ్మని కొలుస్తాం. భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను అందించాలి.

– బండి రజిత, ముస్తాబాద్

ప్రతి ఇంట్లో సందడి



గంభీరావుపేట: బతుకమ్మ పండుగ అంటేనే మహిళలకు సంబురం. రోజూ తీరొక్క పూలలతో బతుకమ్మను పేర్చి కొలుస్తుంటాం. ప్రతి ఇంట్లో పూలపండుగ అంటే సందడిగా ఉంటుంది. మేము ఆనందంగా పండుగను నిర్వహించుకుంటున్నాం. మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ ఆడతాం.

– ముత్తయ్యగారి జ్యోతి, గంభీరావుపేట

ప్రకృతి పండుగ



గంభీరావుపేట: బతుకమ్మ పండుగను ప్రకృతి పండుగగా నిర్వహించుకుంటాం. తెలంగాణలో ప్రతి ఇంటా ఆడపడచులు ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహించుకుంటారు. గౌరీదేవిని పూజించుకుంటాం. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు వేడుకలు జరుగుతాయి.

– లక్కిరెడ్డి విద్య, గంభీరావుపేట

క్లుప్తంగా

వేతనాలు ఇచ్చి ఆదుకోండి

సిరిసిల్లఅర్బన్: పండుగపూట వేతనాలు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. జీపీ కార్మికులకు ప్రతీ నెల జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు వర్కోలు మల్లయ్య, అక్కల అంజయ్య, సందెల మహేశ్, న్యాత నర్సయ్య, రవీందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పలువురు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో బాలసాని నర్సాగౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, బాపురెడ్డి, పొన్నం తిరుపతి గౌడ్, చెల్లెం శ్రీనివాస్ తదితరులున్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న రిటైర్డ్ ఏఈవో దేవయ్య

వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రిటైర్డ్ ఏఈవో పంపరి దేవయ్య రూ.లక్ష విరాళాన్ని ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించి సత్కరించారు.

బీమా చెక్కు అందజేత



గంభీరావుపేట: మండలంలోని గోరింటాల గ్రామానికి చెందిన గొల్లపల్లి ఎల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీఆర్ఎస్ కార్యకర్త కావడంతో పార్టీ తరఫున మంజూరైన రూ. 2లక్షల బీమా చెక్కును శనివారం నాయకులు కుటుంబ సభ్యులకు అందించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, మాజీ ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ కొమిరిశెట్టి లక్ష్మణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ దయాకర్‌రావు, నాయకులు బాల్‌రెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసులు పంపిణీ



దివ్యాంగులకు పాసులు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో దివ్యాంగులకు సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు బస్‌పాస్‌లను శనివారం అందజేశారు. ప్రభుత్వం యాభైశాతం రాయితీతో దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందిస్తోందని మేనేజర్ తెలిపారు. డిపో సూపర్ వైజర్ రాంరెడ్డి, కొండం రాజిరెడ్డి, తిరుపతి, గూడ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తవ్వ ఇంటికి అధికారులు



వివరాలు సేకరిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: కన్న కొడుకు వెంకట్‌రెడ్డి (బజాక్) కనిపించడం లేదని తల్లి పడుతున్న ఆవేదనను ‘సాక్షి’ ప్రచురించగా అధికారులు స్పందించారు. తహసీల్దార్ రామచంద్రం ఆదేశాలతో ఎల్లారెడ్డిపేటలోని తాళ్ల సత్తవ్వ ఇంటికి మండల రెవెన్యూ అధికారి సంతోష్, డేకేర్ సెంటర్ కో–ఆర్డినేటర్ మమత శనివారం వచ్చారు. సత్తవ్వ కుటుంబ సభ్యులు అధికారులతో మాట్లాడుతూ అవసరమైతే సత్తవ్వకు కేర్‌టేకర్‌ను పెడతామన్నారు. పూర్తి వివరాలతో నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు మండల రెవెన్యూ అధికారి సంతోష్ తెలిపారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ ఉన్నారు.

వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలి

గంభీరావుపేట: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో శనివారం నిరసన తెలిపి మాట్లాడారు.



సిరిసిల్ల టౌన్ : సిరిసిల్లలో దుర్గామాత మండపంలో భక్తుల పూజలు



కోనరావుపేట: బావుసాయిపేటలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



బోయినపల్లిలో..

అమ్మవారికి కుంకుమపూజలు.. నైవేద్యాలు

సిరిసిల్ల టౌన్ : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక పూజలు, వ్రతాలు ఆచరించారు. మార్కెట్‌లోని దుర్గామాత సన్నిధిలో మహాన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: పట్టణంలోని సుభాష్‌నగర్ లెవన్ టైగర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో డోలు, భజనలతో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లోని మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

ముస్తాబాద్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడోరోజు దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు. నామాపూర్, చీకోడు, గూడెం, ఆవునూర్, కొండాపూర్ గ్రామాల్లో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో హిందూ వాహిని సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత అమ్మవారు అన్నపూర్ణేశ్వరి రూపాలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామంలోని ఎర్రోజు ఆంజనేయులు దంపతులు అమ్మవారికి పుస్తెమట్టెలు అందజేశారు. ఎర్రోజు సత్యం, గోపాలచారి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి, కోరెం, తడగొండ, బోయినపల్లి, వెంకట్రావుపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో భవాని దీక్షాస్వాములు ప్రత్యేక పూజలు చేశారు.

కోనరావుపేట: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రామనే శ్రీరామ ఉయ్యాలో..

సిరిసిల్లటౌన్/వేములవాడ/వేములవాడ అర్బన్: సిరిసిల్లలో బతుకమ్మ పండుగ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. స్థానిక బాలికలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పట్టణంలోని అన్ని వార్డుల్లో మహిళలు ఒక్కేసి పువ్వేసి చందమామ, రామనే శ్రీరామ ఉయ్యాలో.. అంటూ బతుకమ్మ ఆడారు. సహస్ర జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పాల్గొన్నారు. వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో మహిళలు బతుకమ్మ ఆడారు. అనంతరం ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వేములవాడ జడ్జి జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ: రాజన్న ఆలయ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిరిసిల్ల టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

మాదిగలను మోసం చేస్తున్న సీఎం రేవంత్

కోనరావుపేట: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుకు సీఎం రేవంత్ రెడ్డి విరుద్ధంగా వ్యవరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి అన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9న అన్నిజిల్లాల్లో అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకు నల్ల జెండాలతో నిరసన తెలపాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల మాదిగ ఉపకులాలు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు మంగళ్ చంద్రమౌళి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు అక్కనపల్లి సురేశ్, జాన్, ప్రధాన కార్యదర్శి ముత్తం రాజు, కొమ్ము రాజశేఖర్, ప్రశాంత్, బుర్ర జోసెఫ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడతామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆ హామీని అమలు చేయడం లేదని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ ఈనెల 9న అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. నాయకులు రాకేశ్, శివశంకర్, కిషన్, బాబు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి 10వేల ఇళ్లు కేటాయించాలి

ముస్తాబాద్: ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి పదివేల ఇళ్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మండలంలోని గూడెంలో సీపీఐ కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు పేదలకు ఇల్లు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గానికి 3,500ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఇవీ రెండు మండలాలకు కూడా సరిపోవని, నిర్మాణంపూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. సోమ నాగరాజు, జంగిటి బాబు, రాజు, నారాయణ, రాములు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయ భవనానికి మర్రిచెట్టు మొలిచి ఊడలు పెరుగుతున్నాయి. దీంతో భవనం పూర్తిగా పగుళ్లుబారి వర్షపు నీటితో భవనం శిథిలావస్థకు చేరుతోంది. నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చే ఈ కార్యాలయానికి భవనంపై ఉన్న చెట్టును తొలగించాలనే ఆలోచన కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : శ్రీనివాస్, ఎంపీడీవో, వేములవాడ రూరల్, 9490181163

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626



సిరిసిల్లటౌన్: మున్సిపల్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న జిందం కళ, నాయకులు



బోయినపల్లిలో..

ఘన నివాళి

దివంగత కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్

మిల్లింగ్ త్వరలో పూర్తి చేస్తాం

సాక్షి స్పందన

ముస్తాబాద్: ప్రభుత్వంనుంచి గడువు రాగానే సీఎమ్మార్ పూర్తి చేస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న ‘మిల్లింగ్ ఎప్పుడూ లేటే’ శీర్షిక న సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా పౌరసరఫరాల అధికారి వసంత లక్ష్మి స్పందించారు. సెప్టెంబర్ 30తో లెవికి గడువు ముగిసిందని, మరోసారిగడువును ప్రభుత్వం పెంచినపక్షంలో పూర్తిచేస్తామన్నారు.

షాపింగ్.. సందడి

• వ్యాపారుల ఉపాధికి పండుగ • పెరిగిన రోడ్ ‘సైడ్ బిజినెస్’ • మార్కెట్‌కు పండుగల కళ





సిరిసిల్లలోని ఓ షాపింగ్ మాల్‌లో రెడీమెడ్ దుస్తులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



సిరిసిల్లటౌన్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో జిల్లావాసులు షాపింగ్ బిజీలో మునిగిపోయారు. 15 రోజులుగా సిరిసిల్ల లో మార్కెట్‌కు పండుగల కళ సంతరించుకుంది. ప్రజలు కొత్త దుస్తులు, ఆభరణాలు, పాదరక్షలు ఇతర వస్తువులు కొనేందుకు షాపింగ్ మాల్స్‌కు క్యూకడుతున్నారు. పండుగ సందర్భంగా సిరిసిల్లలో అన్నివర్గాల వ్యాపారులకు కలిసి వస్తోంది. దీనిపై సండే స్పెషల్ కథనం

మార్కెట్లన్నీ కిటకిట

తెలంగాణలో పెద్ద పండుగలైన బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో సందడి నెలకొంది. గత 15 రోజులనుంచి కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ పండుగతో బడా వ్యాపారస్తులతో పాటు వీధి వ్యాపారులు సైతం ఉపాధి పొందుతున్నారు. మహిళలకు సంబంధించి లేడీస్ ఎంపోరియం, ఆభరణాలాల తదితర వస్తువులను దూర ప్రాంతాల నుంచి హోల్‌సెల్‌గా తీసుకొచ్చి పట్టణంలో రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. తక్కువ ధరలో లభించడంతో సామాన్య ప్రజలు కొనుగోలు చేసేందేకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పండుగపూట ఎంతోమంది చిరు వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు.


వన్‌గ్రాం..జ్యూవెల్లరీకి ఆదరణ

అతివలు ఆసక్తి చూపించేటువంటి వన్‌గ్రాం ఆభరణాలను వ్యాపారస్తులు హోల్ సెల్‌గా తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రోల్డ్‌గోల్డ్, గోల్డ్ ప్లేటెడ్ వంటి ఆభరణాలు వెరైటీ డిజైన్లలో లభ్యమవుతున్నాయి. గాజులు, కమ్మలు, మాటీలు, వంకీలు, ఉంగరాలు, బ్రాస్‌లైట్, వడ్డానాలు, తదితర ఆభరణాలు లభిస్తున్నాయి. మెడలో వేసుకునే చైన్లు, లాకెట్, లాంగ్ చైన్, నెక్లెస్‌లు వంటి అలంకరణ వస్తువులు పలు రకాల మోడళ్లలో మార్కెట్లో దొరుకుతున్నాయి. కాస్మోటిక్స్, పూసల దండలు, హెయర్‌రింగ్, బ్యాండ్‌లు, జడ బిల్లలు, పూసల నెక్లెస్‌లు తదితర వాటిని విక్రయిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని మార్కెట్ ఏరియా, గాంధీచౌక్, విమల్ టాకీస్ రోడ్, పెద్ద బజార్ తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన బండ్లు పెట్టుకొని ఉపాధి పొందుతున్నారు.

మాల్స్ టూ..ఫుట్‌పాత్..


పట్టణంలో పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌తో పాటుగా రోడ్డువెంట నిర్వహించే ఫుట్‌పాత్ వ్యాపారం సైతం జోరుగా సాగుతుంది. షోరూమ్స్‌లో లభించే వస్తువులు చిరు వ్యాపారుల వద్ద లభిస్తుండడంతో అన్నివర్గాల వారు ఆసక్తి చూపిస్తున్నారు. రీజనేబుల్ ధరల్లో కాస్మోటిక్స్, ఎంపోరియం ఐటమ్స్, ఆభరణాలు లభిస్తున్నాయి. మోడళ్లను బట్టి ధరలు గాజులు రూ. 50 నుంచి రూ.500లు పైగా ఉండగా, కమ్మలు, నెక్లెస్ వంటి రూ.100 నుంచి రూ.వెయ్యి వరకు ధరలు ఉన్నట్లు వ్యాపారస్తులు పేర్కొన్నారు. ఇవేగాక చైన్‌లు, పట్టీలు, రింగ్, నెయిల్‌పాలీష్‌లు తదితర వస్తువులు తక్కువ ధరల్లో లభ్యమవుతున్నాయి.

మాకు సీజనల్ ఉపాధి



రెండేళ్లుగా సిరిసిల్లలో రోడ్డుసైడ్ బిజినెస్‌తో ఉపాధి పొందుతున్నాం. మాకు వేములవాడలో దుకాణం ఉంది. బతుకమ్మ పండుగకు ఇక్కడ దుకాణాన్ని నిర్వహిస్తాం. పెద్దషాపుల్లో లభించే ఐటమ్స్ మావద్ద తక్కువ ధరల్లో దొరుకుతున్నాయని కస్టమర్లు సంబరంగా చెప్తుండ్రు. పండుగ సందర్భంగా మహిళల కోసం కొత్త డిజైన్లలో కమ్మలు, గాజులు, మాటీలు, తదితర వస్తువులను విక్రయిస్తున్నాం. – గుమ్మడి కవిత

ఫ్యాన్సీ ఐటమ్స్‌కు డిమాండ్



అన్నిరకాల ఫ్యాన్సీ ఐటమ్స్‌కు డిమాండ్ ఉంది. ముఖ్యంగా బ్యాంగిల్స్, ఏడీ బ్యాంగిల్స్, సీజడ్ బ్యాంగిల్స్ చీరలు, డ్రెస్సులకు మ్యాచింగ్ అయ్యేలా అన్ని రంగుల్లో ఉన్నాయి. డజన్‌కు రూ. 20 నుంచి రూ. 150 వరకు ధరలున్నాయి. వన్‌గ్రాం నెక్‌సెట్స్, మ్యాట్ నెక్లెస్, సీజడ్ నెక్లెస్‌లను ఎక్కువగా అడుగుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పుడిప్పుడే వ్యాపారం సీజన్ ప్రారంభమైంది. – నాగిశెట్టి మీనాక్షి



సంక్షిప్త వార్తలు

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా వినోద్

సిరిసిల్ల: బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా దండు వినోద్‌ను నియమించినట్లు యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ శనివారం తెలిపారు. వేములవాడ సాయినగర్‌కు చెందిన దండు వినోద్ చేస్తున్న సేవలను గుర్తించి నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. బీసీసంఘం బలోపేతానికి, కృషి చేస్తానన్నారు.

● కార్మికులకు ఓటీ ఇప్పించాలి

సిరిసిల్లటౌన్: షాపింగ్ మాల్స్‌లో పనిచేసే కార్మికులకు అధికారులు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. సిరిసిల్లలోని ఏఎల్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. పండుగల సీజన్ నేపథ్యంలో కార్మికులకు పనిభారం పెరిగిందన్నారు. జిల్లాలోని మాల్స్‌ను తనిఖీలు చేసి కార్మికుల శ్రమకు తగిన వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

● బైపాస్‌రోడ్డుపై లైట్లు ఏర్పాటు చేయండి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ నుంచి రగుడు వరకు నిర్మించిన బైపాస్‌రోడ్డుపై లైట్లు, సిగ్నల్‌బోర్డులు ఏర్పాటు చేయాలని వెంకటాపూర్‌కు చెందిన పలువురు యువకులు కోరారు. ఈమేరకు శనివారం రోడ్డుపై విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై గతంలోనే ఆర్అండ్‌బీ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. బైపాస్ రోడ్డులో సుమారు 600 మీటర్ల పొడవు డాంబర్ రోడ్డు వేయకపోవడంతో రాంగ్ రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సన్ని, చరణ్, జాగిరి పర్శ రాములు, పాండాల వెంకటేశ్, నవీన్ పాల్గొన్నారు.

స్తంభాలు తొలగించాలి

వీర్నపల్లి: మండలకేంద్రంలో రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ అధి కారులు, సెస్ అధికారులతో కలిసి ప్రయాణికుల ఇబ్బందులు కలగకుండా విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. సెస్ సిబ్బంది ఉన్నారు.

● కార్యవర్గం

బోయినపల్లి: మండలకేంద్రంలో శనివారం జిల్లా నాయకులు రాగుల రాములు, బొలుమాల శంకర్, జంగం అంజయ్య, నాలుక సత్యం, రొడ్డ రామచంద్రం, దోసల చంద్రం ఆధ్వర్యంలో బోయినపల్లి మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రాకం రాజేశ్, ఉపాధ్యక్షులుగా కాడె భాస్కర్, ఈడుగు నరేశ్, కోశాధికారిగా దాసరి బాబు, సంయుక్త కార్యదర్శులుగా మండల నరేశ్, ఎర్ర రవి, సాగర్, ప్రేమ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా రాజారామ్, బాబు, ర్యాకం అనీల్, ర్యాకం మహేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. అంజయ్య, స్వామి, భూమయ్య, లింబాద్రి పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కాయితీ రోహిణి, గట్టపల్లి వంశిక మెదక్ జిల్లా ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8 వరకు జరిగే అండర్–17 బాలి కల విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ రవి కుమార్, ఎస్జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హెచ్ఎం మాణిక్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

● చర్యలు తీసుకోవాలి

వేములవాడ అర్బన్: ప్రసవం కోసం వేములవాడ ఏరియా ఆస్పత్రికి వచ్చిన మహిళలు గంటల తరబడి ఉన్నా వైద్యులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కదారి రాములు అన్నారు. వేములవాడలో శనివారం మాట్లాడారు. ప్రధాన వైద్యాధికారికి విన్నవించినా పట్టించుకోవడం లేదని, సిరిసిల్ల, కరీంనగర్ ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.